# 6

# తిరిగి బ్రదికించిన వ్యక్తి

## (2 రాజులు 4:18-37; 8:1, 5)

మనము ఎలీషా షూనేమీయురాలి కథను కొనసాగిస్తున్నాము. గత పాఠములో ఎలీషా జీవమును అనుగ్రహించినవాడిలా కనుగొన్నాము. ఎలా అంటే తనకు మేలు చేసిన వారికి ఒక చక్కని బాలుని ఇచ్చాడు. ఈ పాఠములో ఆ ప్రవక్త *జీవాన్ని* తిరిగి *ప్రసాదించేవాడుగా* మనం చూస్తాము. తరువాత ఈ సందర్భాన్ని ప్రస్తావించినప్పుడెల్లా పరిభాష పదాలు మరల మరల వాడబడ్డాయి:

> … ఎలీషా తాను *బ్రదికించిన* బిడ్డకు తల్లియైన ఆమెతో మాట్లాడెను … (2 రాజులు 8:1; నొక్కి చెప్పింది నాది).

> అతడు ఒక మృతునికి ప్రాణము తిరిగి రప్పించిన సంగతి వాడు రాజునకు తెలియజెప్పుచుండగా, ఎలీషా *బ్రదికించిన* బిడ్డ తల్లి తన యింటిని గూర్చియు భూమిని గూర్చియు రాజుతో మనివిచేయ వచ్చెను. అంతట గేహజీ – "నా యేలినవాడవైన రాజా ఆ స్త్రీ యిదే; మరియు ఎలీషా తిరిగి *బ్రదికించిన* యీమెబిడ్డ వీడే …" (2 రాజులు 8:5; ఇది నా వ్యాఖ్యానం).

ఈ అద్భుత కార్యం చేసింది దేవుడే అని మనకు తెలుసు కాని ఆయన తన నమ్మకమైన సేవకుడైన ఎలీషా ద్వారా చేశాడు. ఈ పాఠం ముగిసేలోగా మనకు స్పష్టంగా గ్రాహ్యమయ్యేదేమంటే, ఆనాడు షూనేమీయురాలికి సహాయం చేసిన దేవుడు ఈ రోజు మన జీవితాలలో విషాదం తొంగిచూచినప్పుడు ఆయన వచ్చి మన జీవితాలలో చేరి ఆదరించగలడు కూడ.

### ఆనందోత్సాహాలు మరియు హృదయ వేదన (4:18–20)

**సంతోషం**

గత పాఠం ముగిసేలోగా, ఆ స్త్రీకి అప్పుడే ఒక కుమారుడు జన్మించియున్నాడు. ఇక అప్పటినుండి ప్రతిరోజు తల్లిగా ప్రతి అనుభవం ఆమెనెంతో అచ్చెరువుపరచింది. ముఖ్యంగా ఆ బాబు చిలకపలుకులు, తప్పటడుగులు.

ఈ పాఠం ప్రారంభమయ్యే సరికి, అనేక సంవత్సరాలు గడిచిపోయాయి. 2 రాజులు 4:18 ఇలా అంటుంది, "ఆ బిడ్డ యెదిగిన తరువాత ఒకనాడు కోత కోయువారియొద్దనున్న తన తండ్రి దగ్గరకుపోయి అక్కడ ఉండగా." అతడు మంచి యవ్వనప్రాయంలో ఇరవైయ్యేళ్ళ వయసులో ఉన్నట్టు ఈ వచనం ద్వారా మనం గ్రహించగలం. అప్పటికీ తల్లి ఒడిలో కూర్చొని ఆడుకొనే వానిగానే ఉన్నట్టనిపిస్తున్నాడు. అమ్మ అతన్ని ఎత్తుకొని అటుఇటు తిప్పుతున్నట్టు గోచరిస్తుంది (20, 21 వచనాలు). "పిల్లవాడు" (26, 34) మరియు "బాలుడు" (29, 31,

32, 35) అని పిలువబడుచున్నాడు. బహుశ అతను నాలుగునుండి ఆరు సంవత్సరాలు కలిగి – అతడు పరుగెత్తుకుంటూ పొలంలోవున్న తన తండ్రి దగ్గరకు వెళ్ళగలిగే వయసుగలవాడై ఉండవచ్చు.

ఇక్కడ మూడు విషయాలు మనం గమనించాలి, మొదటిగా పొలంలోనికి వెళ్ళడానికి అతని తల్లి అతనికి అనుమతి యివ్వలేదు. నేను చిన్నవానిగా మూడు సంవత్సరాల ప్రాయంలో ఉన్నప్పుడు నేను నా పుస్తకాలు చంకనపెట్టుకొని, దగ్గరలో వున్న బళ్ళోకి అంటే మానాన్న పంతులుగారిగా పనిచేస్తున్న బళ్ళోకి నడుచుకుంటూ వెళ్ళాను (అది ఆయన మొట్టమొదటిగా టీచర్ పనిచేసిన సందర్భం. ఆయనెంతో యిబ్బందిగా ఫీలయ్యేవాడు). ఈ బాలునికి వాళ్ళ నాన్న ఏ పొలంలోవుంటాడో అక్కడికి వెళ్ళడానికి దారి తెలుసు. వాళ్ళ అమ్మకి తెలియకుండా యింట్లోనుండి జారుకున్నాడు. సరే ఒకవేళ అతని తల్లితో చెప్పి వెళ్ళినట్టయితే ఆమె అతని వెంట ఎవరో ఒక సేవకుని పంపియుండవచ్చు. బహుశ ఏ సేవకుడు అతన్ని తిరిగి తీసుకొచ్చాడో అతనే అక్కడికి వాణ్ణి తీసుకొని వెళ్ళియుండవచ్చు (19, 20 వచనాలు). మూడవదిగా, గ్రామాల్లో బ్రతికే ప్రజల్లో చిన్నపిల్లలు చిన్ననాటినుండే పొలం పనికి వెళ్ళడం సహజంగా జరుగుతుంది. బహుశ ఈ బాలుని తండ్రి పొలంలో జరుగుతున్న కోత పనిలో వీడు కూడ వచ్చి పనిచేస్తే కొంత అనుభవం అనుభూతులు కలిగియుండవచ్చని భావించియుంటారు.

ఏదిఏమైనా, ఈ బాలుడు మాత్రం పొలంలోవున్న తండ్రి యొద్దకు చేరుకున్నాడు (18 వచనం). అది కోతకాలం, ప్రజలంతా ఎక్కడలేని బిజీగా ఉండే సమయం ఎంతో కోలాహలంగా పనివారు పనిచేసే సమయం కాబట్టి ఈ బాలుని ఆనందానికి అంతులేదు. ఆ బాలుడు యిటుఅటు పరుగెత్తడం, ఆ ధాన్యం కుప్పలలో ఆడుకోవటం, ఆనందంతో కేరింతలు కొట్టడం అచ్చంగా నేను చూస్తున్నట్టే నా మనస్సులో చిత్రాన్ని చిత్రించుకొంటున్నాను. ఈ వృద్ధ తండ్రి వాడి చిలిపి చేష్టలు చూస్తూ ఎక్కడలేని ఆపేక్షతో ఆనందభరితుడై యుండవచ్చు.

## హృదయవేదన

ఇంతలో, ఎక్కడాలేని భీభత్సం సంభవించింది. ఆ పిల్లవాడు “నా తలపోయెనే, నా తలపోయెనే” (19ఎ వచనం) అంటూ తలపట్టుకొని పెద్దగా ఏడ్వడం ప్రారంభించాడు. మరి వాడి జబ్బు, బాధ ఏంటో అర్థం కావడంలేదు. వాళ్ళ నాన్న ఎంత జాగ్రత్తగా గమనిస్తున్న ఈ ఆకతాయి కుర్రవాడు ఏదో ఒక నష్టం చేసుకొనివుంటాడు. దగ్గరలోవున్న కోత కొడవళ్ళ సామాగ్రి ఏదో అతన్ని గాటుపరచియుంటుంది. తలకు దెబ్బ తగిలియుంటుంది. అనేక వ్యాఖ్యానాలు ఈ బాబుకి ఎండదెబ్బ తగిలింది అని వ్యాఖ్యానాలు చెబుతున్నాయి. అది వాస్తవమై ఉండవచ్చు. ఎందుచేతనంటే అది మిట్ట మధ్యాహ్నం (కీర్తనలు 121:6; యెషయా 49:10). డోనాడ్ వైస్‌మెన్ అనే అతను ఇలా అభిప్రాయపడుచున్నాడు, ఆ దినాల్లో “ఎండదెబ్బ పిల్లలకు తగలడం అనేది చాలా అరుదు. అది యసడారిలిన్ అనే భూభాగం మీద కోత సమయములో జరిగేది కాదు.”[1] కొన్ని కొన్ని వైద్యసంబంధమైనటువంటి వివరణలు ముఖ్యంగా అనురీసిమ్ లేక మెదడువాపు.[2] ఆ జబ్బు ఏమైనా కానీయండి, తల్లి ప్రేమతో తీసుకునే శ్రద్ధకంటే ఎక్కువగా ఏ జబ్బును మరి ఏ మందులు నయం చేయలేవని తండ్రికి బాగా తెలుసు. అతనికి కోత పనివారి పనిని పర్యవేక్షించే బాధ్యత ఉన్నది కాబట్టి అతని

సేవకుని పిలిచి "వానిని ఎత్తుకొని తల్లి యొద్దకు తీసుకొని పొమ్మని" చెప్పవలసి వచ్చింది (2 రాజులు 4:19బి).

ఈ పిల్లవాన్ని ఇంట్లోకి తీసుకొని రాగానే చూచిన తల్లికి ఎంత హృదయవేదనగా ఉంటుందో మనం గ్రహించగలం (20ఎ వచనం చూడు). ఆ రోజు ఉదయం పూట చక్కగా నవ్వుకుంటూ ఆడుకోవటం ఆమె చూచింది. ఇప్పుడు సేవకుని చేతిలో వడలి పోయి పడివుండడం చూడటంతో ఆమె ఎంతో భయకంపితురాలై ఆ బాలుడిని తీసుకొని తన ఒడిలో కూర్చొనబెట్టుకుంది (20బి వచనం చూడు). "నా తలపోయెనే, అమ్మా; నా తలపోయెనే అమ్మా!" అని ఏడ్చుచున్న తన కుమారుని చూచి కన్నీరు మున్నీరుగా రోదించింది తల్లి. ఇక్కడ ఒక క్షణం ఆగుదాం. ఆ తల్లి గావు కేకలు, ఆమె అటుఇటు ఉత్కంఠతో పరుగెత్తుతున్న ఆమెను నా మనస్సులో చిత్రించుకొనుచున్నాను. వాడి నొసటి మీద తడిబట్ట వేసి వాడ్ని ముద్దుపెట్టుకోవడం గమనిస్తున్నాను. ఆమె భావాలను కూడ నేను ఇలా ఊహించగలుగుచున్నాను: "వీడు చావనే చావడు. ముమ్మాటికి చావడు! దేవుడు నాకు ఇచ్చాడు; కాబట్టి, వాడ్ని నా దగ్గర నుండి తీసుకొనిపోడు!"[3] అంటూ ఆమె తన విజ్ఞాపన ప్రార్థలను పరలోకం వైపునకు మరలించింది: "దేవా! నా కుమారుడు చావటానికి వీలులేదు ప్రభువా, నా కుమారుడు చావడానికి వీలు లేనేలేదు!"

ఆమె ఎంత ప్రేమిస్తూ తిరిగి వాడిని ఎంత ఉజ్జీవింప చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికి, వాడికి ఓపిక లేక సోలిపోతూనే ఉన్నాడు. ఆమె దుఃఖము అంచలంచలుగా ఇగిరిపోయింది, ఆగిపోయింది. వాడు ఒక్కసారి ఊపిరి వదిలివేసాడు. ఆ పసివాని దేహం నిర్జీవం అయిపోయింది. వాక్యం ఇలా చెప్పుచున్నది, "పిల్లవాడు మధ్యాహ్నమువరకు తల్లి తొడమీద పండుకొని యుండి చనిపోయెను" (20బి, సి వచనం). బైబిల్ అద్భుతాల గురించి నమ్మనివారు ఆ పిల్లవాడు అపస్మారక స్థితిలోనికి వెళ్ళిపోయినాడని అంటారు. "మంచి అనుభవం గల చరిత్రకారుడు కూడ ఈ సంగతిని అంత స్పష్టంగా వ్రాయలేకపోతున్నాడు":[4] ఆ బాలుడు "మరణించాడు" (32వ వచనం చూడు).

అమాయకపు పిల్లలు – మరణిస్తారా? ప్రతిరోజు మనం చూస్తూనే ఉన్నాము. వారు ఎందుకు మరణిస్తారు? ఎందుకంటే పాప లోకంలో మనం జీవిస్తున్నాము. పూర్వకాలము ఆదాము అవ్వలతో మీరు గనుక నిరాకరించబడిన చెట్టు ఫలము తింటే "తప్పక మరణిస్తారు" అని చెప్పబడినది (ఆదికాండము 2:17). తరువాత వారి అవిధేయత వలన "మరణం మానవాళికి పాకింది" (రోమీయులకు 5:12); అది లోకమంతటి పరిస్థితిగా మిగిలిపోయింది. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను" (హెబ్రీయులకు 9:27). కొందరు వృద్ధాప్యంలో మరణిస్తారు, కొందరు మధ్య వయస్సులో మరణిస్తారు, కొందరు బాల్యంలోనే మరణిస్తారు. ఇలాంటి విషాద పరిస్థితులు, ఆ పరలోకపురి కొరకు ఎదురుచూడ్డాన్ని తీవ్రం చేస్తుంది. ఎందుకంటే, "మరణము ఇక ఉండదు" (ప్రకటన 21:4). అప్పుడు మన హస్తాలనుండి కొనిపోబడిన మన ప్రియ బిడ్డలను కలుసుకుంటాము (2 సమూయేలు 12:23 చూడు).

## ఒక ప్రణాళిక మరియు ఒక విన్నపము (4:21-31)

**ఒక ప్రణాళిక?**

తన కుమారుడు మరణించాడు అన్న సంగతిని తెలుసుకొని షూనేమీయురాలు ఎలా స్పందించింది? ఆమె దుఃఖముతో గుండెలు బాదుకుంటూ మూర్ఛిల్లియుండేటిది. ఆమె తన స్నేహితులను పిలిచి తనతో కలిసి రోధించవలెనని కోరియుండేటిది. ఆమె తన సేవకులను పిలిచి ఆ బాలుని దేహాన్ని సమాధి నిమిత్తము సిద్ధం చేయమని అడిగివుంటుంది అని మనం భావించుకోవచ్చు. దానికి బదులు ఆమె మరో విరుద్ధమైన పని చేసింది. “అప్పుడు ఆమె పిల్లవానిని దైవజనుని మంచముమీద పెట్టి తలుపు వేసి బయటికి వచ్చి” (2 రాజులు 4:21). ఆమె అలా ఎందుకు చేసిందో అన్న అసలు విషయాన్ని నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. ఆ సమయంలో ఆమె ఆలోచనా సరళి ఎలావుందో అని కూడ నేను తెలుసుకోగోరుచున్నాను. ఈ క్రింద చూపబడిన పరిశీలనలు పరిస్థితిని వివరించగలవో వివరించలేవో:

(1) వాస్తవానికి ఆ ప్రవక్త పడక గది ఆ యింట్లో వున్న చిన్న గదుల్లో ఒకటైయుండవచ్చు. ప్రస్తుతం ఆమె యిల్లు విడిచి వెళ్ళవలసివుంది. ఎన్నో గంటల సమయం పట్టవచ్చు. ఆమె ఆ బాలుని శవాన్ని అతని గదిలో పెట్టిన ఉద్దేశమేమంటే తను తిరిగి వచ్చేవరకు ఆ శవాన్ని ఎవరూ ఏమి చేయలేరు అని, యూదుల నియమము ప్రకారం యూదులు తమ మరణించిన ప్రియులను అదే రోజు సమాధి చేయవలెను. తన కుమారుని నిమిత్తమైన అంత్యక్రియలు యింకా ప్రారంభం కాలేదని ఆ స్త్రీకి స్పష్టంగా తెలుసు.

(2) ప్రవక్త పడక గది ఆ యింట్లో ఒక ప్రత్యేకమైనదిగావుంటుంది. ఇంకా యితర గదులున్నాయి. ఉదాహరణకు ఆమె తన పడక గదిలో దేహాన్ని పెట్టవచ్చు కాని *ప్రవక్త* పడక గదిలో పెట్టి తరువాత అతనిని చూడడానికి వెళ్ళిందంటే ఆమె ఉద్దేశం ప్రవక్త ఈ విషయంలో తప్పక జోక్యం చేసుకోగలడని ఆమె ఉద్దేశం.

ఈ కథలో ముందుకెళ్ళక ముందు పై వ్యాఖ్యాలన్నీ మనసులో వుంచుకొందాం. ఆ ప్రవక్త పడక గదిలో ఆ బాలుని శవాన్ని వుంచిన తర్వాత, “ఆమె తన భర్తకు కబురు చేసింది” (22ఎ వచనం). బహుశ అతనున్న పొలం దగ్గరకు వెళ్ళియుండవచ్చు. అతనితో యిలా అన్నది, “ఒక పనివానిని ఒక గాడిదను నా యొద్దకు పంపుము; నేను దైవజనుని యొద్దకు పోయి వచ్చెదనని ...” (22బి వచనం). “దైవజనుడు” (9 వచనం) అనే మాట ఎలీషాకు ఆమె వర్తింపజేసింది. యిది మనం గమనిస్తున్నాము.

ఆమె ఎలీషా వద్దకు ఎందు కెళ్ళిందో కారణం ఈ వాక్యభాగంలో చెప్పబడలేదు. ఆమె ప్రవక్తవున్న స్థలానికి వచ్చినప్పుడు తన దుఃఖాన్ని అతనికి చెప్పుకున్నది (28 వచనం), ఆమె యింత దూర ప్రయాణ చేసినప్పటికి తన కుమారుని మీద ఆశలు వదులుకున్నట్టు లేదు. ఆమె తన ప్రయాణాన్ని వురుకుల పరుగుల మీద చేసింది (24 వచనం). వెంటనే ఎలీషా తనతో బయలుదేరవలసినదిగా ప్రాధేయపడింది (30 వచనం). అంటే ఆ ప్రవక్త పడక గదిలోవున్న తన బాలుని శవాన్ని వెంటనే వచ్చి దర్శించాలని కోరింది.

ఇంతకు ముందు పాఠాల్లో నేనొక విషయం తెలిపియున్నాను. అదేమంటే ఎలీషా ఆమె గృహంలో భోజనం చేసినప్పుడల్లా ఆ భోజనపు బల్ల దగ్గర తన గురువుగారైన ఏలీయా గురించిన కథలు చెబుతూ వుండేవాడని. ఆ సమయంలో ఏలీయా చేసిన గొప్ప అద్భుత

కార్యం గురించి చెప్పియుంటాడు: సారెపతు విధవరాలి కుమారుని బ్రతికించడం గురించి (1 రాజులు 17:17–24). బైబిలు ప్రకారం చూస్తే ఆ ఒక్క సందర్భంలో తప్ప అంతకు ముందుగాని తదుపరిగాని చనిపోయిన వాళ్ళను లేపిన వాళ్ళెవరూ లేరు. ఆ కథను షూనేమీయురాలు విన్న తర్వాత, బహుశ ఎలీషా కూడ అదే విధంగా చేయగలడని ఆమె నమ్మకం (2 రాజులు 2:14; 2 రాజులు 2:8 ఈ వచనాలతో 2 రాజులు 4:1–7; 1 రాజులు 17:8–16తో పోల్చి చూడు). వైజ్‌మెన్ అనే వేదాంతి యిలా అంటున్నాడు "ఆ స్త్రీ తన కుమారుని పోగొట్టుకున్నదేమో గాని, ఆమె తన విశ్వాసాన్ని మాత్రం పోగొట్టుకోలేదు."[5]

ఆమె ఉద్దేశమేమైనా ఉండవచ్చు. తాను ఎలీషాగారి దగ్గరకు వెళ్ళిరావడానికి ఒక సేవకుని ఒక గాడిదను సిద్ధం చేయవలసిందని తన భర్తను కోరింది (22బి వచనం). ఆ ప్రవక్త నొద్దకు ఆమె వెళ్ళుతుంది అని తెలుసుకున్న ఆమె భర్తకు ఆశ్చర్యమేమి కలుగలేదు. కాని ఆమె వెళ్ళే వేళ (వేళాపాళా లేకుండ) అతన్ని ఆశ్చర్యపరచింది. ఇలా అంటున్నాడు, "నేడు అమావాస్యకాదే; విశ్రాంతి దినముకాదే; అతనియొద్దకు ఎందుకు పోవుదువని యడుగగా" (23ఎ వచనం). సబ్బాతు మరియు అమావాస్య యూదయస్తుల కార్యకలాపాలకు చాలా మంచి రోజులు (నిర్గమకాండము 20:8–11; సంఖ్యాకాండము 29:6; నెహెమ్యా 10:33; కీర్తనలు 81:3 చూడు). ఈ విషయంలో కొందరు చెప్పేదేమంటే విశ్వాసులనబడిన వారు ఆ ప్రత్యేక దినాల్లో ఎలీషా దగ్గర సమకూడేవారు అని అందుచేత అలాంటి ప్రత్యేక సందర్భం కూడ కాదు గదా, అందుకతడు ఆశ్చర్యంతో చలించిపోయాడు.

ఆమె దానికేమి జవాబు చెప్పలేదు. ఒక్కమాట మాత్రం అనగలిగింది, "నేను పోవుట మంచిది" (2 రాజులు 4:23బి వచనం). "నేను వెళ్ళుట మంచిది" అనే మాట ఆమె తన కుమారుడు తప్పక బ్రతుకుతాడు అన్న పూర్తి నమ్మకం ఆమెకున్నదనుటకు రుజువుగా ఉంది. అయితే ఎలీషా మాట్లాడిన ఆమె తొలి మాటలు అలాంటి నమ్మకాన్ని ప్రతిబింబించుట లేదు (వచనం 28). ఒక శిశువు మరణించినప్పుడు అతని ఆత్మ ప్రభువునొద్ద నివసించుటకు పోతుంది (2 సమూయేలు 12:23) – ఈ సత్యం ఎంతో మంది తమ పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రులను ఓదార్చుతుంది. మరియు షూనేమీయురాలు ఎలీషాతో అన్న తరువాత మాటల్లో ఆమెకు ఈ అభిప్రాయము మనస్సులో ఉందన్న భావం కలిగించడం లేదు (2 రాజులు 4:28).

ఇక్కడ ఆ స్త్రీ తన భర్తతో *Shalom*[6] అని అన్నది. షాలోమ్ అనగా హెబ్రీ భాషలో "శాంతి"[7] అని అర్థము. ఈ మాటను అప్పుడప్పుడు వాడడం ఎందుకంటే "ఏదైనా ఖచ్చితమైన జవాబు చెప్పడం కుదరనప్పుడు, ఏదో వారిని తృప్తిపరచడానికి ఇలా అంటారు."[8] నేనున్న ప్రాంతములో "ఏమి ఫర్వాలేదు," లేక దీని విషయం "ఏమి చింతపడవద్దు" అని ప్రజలు అంటూ ఉంటారు. ఆస్ట్రేలియా ప్రాంతములో "ఆమె నీకు సరైన జంట!" (అనగా దాని అర్థము "అది నీకు సరైన, స్నేహితుడు"). ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఇలాగే సంభాషిస్తూ ఉంటారు.

ఆమె భర్త తరువాత వివరాలు ఎందుకు అడగలేదు? అని కొందరు ఆశ్చర్యపడతారు. బహుశ ఆ కోత పనిలో, పనివారితో వ్యవహరించడంలో అతడు ఎంతో బిజీగా ఉండవచ్చు. అతడు తన కుమారుని గూర్చి ఎందుకు అడగలేదు? అని కొందరు అంటారు. దీని అంతటికి కారణం ఆ బాలుడే కనుక బాగుంటే ఆమె ఇల్లు వదలి వచ్చేది కాదు అని తెలుసుకోవాలి.[9]

ఆమె మాటలకు అతడు సంతృప్తిపడినందున ఆమె విన్నపాన్ని అంగీకరించాడు. ఈ కోత పని సమయంలో ఒక పనివాడు, ఒక గాడిద ఎంతో అవసరము. అయినప్పటికి అవిలేకుండ అతడు సగం రోజును గడపగలిగినాడు.

ఆ స్త్రీ గాడిద మీద కూర్చొని సేవకునితో "శీఘ్రముగా తోలుము, నేను నీకు సెలవిచ్చితేనే గాని నిమ్మళముగా తోలవద్దనెను" (24 వచనం). ఇక్కడ "తోలుము" అంటే అర్థం "దాన్ని వేగవంతంగా ప్రయాణం చేయడానికి బాగా తోలుము" అని అర్థం. ఆమె వెళ్ళవలసిన స్థలము కర్మెలు పర్వతం (25ఎ వచనం). ఆమెకు 15 నుండి 20 మైళ్ళ దూరములో ఉన్న ప్రవక్తను చేరుకోవడానికి ఎంతో ఉత్కంఠతో ప్రయాణం చేయవలసి వచ్చింది. ఎలీషా ఆ పర్వతం మీద ఉంటాడని ఎలా తెలిసిందో మనకు తెలియదు. బహుశ, గతములో అతను కర్మెలుకు వెళ్ళుచూ వీరి ఇంటి వద్ద కొంతసేపు ఆగి ఉండవచ్చు.

అనేక గంటలు ప్రయాణం చేసిన తరువాత ఆమె కర్మెలు పర్వతానికి చేరుకొన్నది (25ఎ వచనం). దూరంనుండి ఎలీషా ఆమెను చూశాడు (25బి వచనం). ఏదో జరగరానిది జరిగిందని ఊహించుకున్నాడు. ఆమె ఆ గార్ధభం మీద రావడంలో అంత భాగ్యవంతమైన స్త్రీకి కొంత చిన్నతనముగానేయున్నది. ఎవరినైన మనం కలిసినప్పుడు, ఆ సమయంలో వారు బాధలో ఉంటే, వారికేదో, ఆమెకు లేక అతని కుటుంబములో ఏదో జరుగరానిది జరిగిందని ఊహిస్తాము. ఎలీషా అలాగే ఆశ్చర్యపడ్డాడు. వెంటనే, తన సేవకునితో "అదిగో ఆ షూనేమీయురాలు; నీవు ఆమెను ఎదుర్కొనుటకై పరుగున పోయి – నీవును నీ పెనిమిటియు నీ బిడ్డయు సుఖముగా ఉన్నారా" (25సి, 26ఎ వచనం) అన్నాడు.

గేహజీ పరుగెత్తుకుంటూ వెళ్ళి ఎలీషా తనను అడగమన్నట్టుగా ఆమెను ప్రశ్నించాడు. దానికి ఆమె ఒక్కమాటలో "సుఖముగా ఉన్నాము" అని చెప్పింది (26బి వచనం). మరలా ఆదిమ భాషలోని అర్థము ఆమె "*Shalom*"[10] అని చెప్పినట్టు గ్రహించాలి. వాస్తవానికి ఆ జవాబు అంత అర్థవంతంగా లేదు. నేనున్న స్థలములో కూడ ఎవరైన అవతల వ్యక్తిని ఎలా ఉన్నారు? అని అడిగినట్టయితే "బాగున్నాను" అని చెప్పుతుంటారు. దానికి "నేను బాగున్నాను" అని కానీ నేను అంతగా "బాగోలేదని" కానీ, ఆ విషయం నేను మాట్లాడదలచుకోలేదని కానీ అర్థం చేసుకోగలం. ఆ చివరిమాట, ఆమె యొక్క మనస్సులోని భావాన్ని వ్యక్తం చేస్తుంది. ఆమె తన కష్టాలను ప్రవక్తకు తప్ప మరి ఎవరికి చెప్పుకోదలచలేదు.

**ఒక విన్నపం?**

ఆమె, ఆ పర్వతము క్రింద చేరుకున్నప్పుడు, ఎలీషాను చూచుటకు త్వరత్వరగా ఆ కొండ ఎక్కింది. తన హృదయ వేదనను తట్టుకోలేక అతని పాదాల మీద పడిపోయింది. "అతని కాళ్లు పట్టుకొనెను" (27ఎ వచనం). ఆమె అతని పాదాలు పట్టుకోవడంలో అది విధేయతకు, పూర్తిగా ఆధారపడడానికి సూచనగా ఉంది (లూకా 5:8; మార్కు 5:22; 7:25 చూడు). అతని పాదాలు పుణికి పట్టుకోవడం అనేది ఆమెకున్న అనుబంధాన్ని వ్యక్తం చేస్తుంది (మత్తయి 28:9 చూడు).

గేహజీ, ఆమె అమర్యాద ప్రవర్తనకు నొచ్చుకున్నాడు. వెంటనే, "ఆమెను నెట్టివేయడానికి దగ్గరికి వచ్చాడు (27బి వచనం; పోల్చి చూడు మత్తయి 19:13తో). ఎలీషా, వెంటనే మందలించాడు, "ఆమె బహు వ్యాకులముగా ఉన్నది, యెహోవా ఆ సంగతి నాకు

తెలియజేయక మరుగు చేసెను; ఆమె జోలికి పోవద్దని వానికి ఆజ్ఞ ఇచ్చెను" (2 రాజులు 4:27బి వచనం). ఆ స్త్రీకి ఏదో జరుగరాని దుస్థితి జరిగిందని స్పష్టమౌతుంది. అయితే ఎలీషాకు ఆ విషయం తెలియదు. మర్మాలను తెలియజేయటానికి కావలసిన హక్కును అనుగ్రహించే దేవుడు 24 గంటలు వారిని నడిపించినప్పటికి వారికి కొన్నికొన్ని విషయాలు గ్రాహ్యంకాక పోవడం సహజమే.

చిట్టచివరకు ఆ స్త్రీ తన బాధను చెప్పుకోగల్గింది. తన హృదయ వేదనను కుమ్మరించింది, "కుమారుడు కావలెనని నేను నా యేలినవాడవైన నిన్ను అడిగితినా? నన్ను భ్రమపెట్టవద్దని నేను చెప్పలేదా?" (28వ వచనం; 16వ వచనం చూడు). ఆమె ప్రియమైన ముద్దుల కుమారుడు అనుకోకుండా చనిపోవడం, ఆశ్చర్యంగా ఉంది కదూ? "ప్రభువు తనకు కుమారుడ్ని ఇచ్చినట్టుగా ఇచ్చి ఆయన కృపను, ఆయన వాగ్దానాన్ని తన వాక్యము ద్వారా నెరవేర్చి, మరలా తన కుమారున్ని తీసుకొని పోవడం ఎందుకో? అన్న ప్రశ్న ఆమె మనస్సును కలచివేసింది."[11] దానిని బట్టి ఆమె "ఇది నాకు ఎందుకు సంభవించిందో, నాకు అర్థం కావడం లేదు?" అని అంటుంది. ఈ స్త్రీ మాటలకు ఎలీషా కొంత బాధపడి ఉండవచ్చు. కానీ, బాధపడలేదు. సహజంగా దుఃఖములో మునిగిపోయిన వారు ఆ పరిస్థితికి తట్టుకోలేక ఏవేవో అనరాని మాటలు అర్థములేని మాటలు వెళ్ళగ్రక్కుతూ ఉంటారు (1 రాజులు 17:18 చూడు), ఎలీషాకు ఆ విషయం బాగా అర్థమైయింది.

ఆ స్త్రీ యొక్క మాటలను బట్టి ఆమె కుమారునికి జరుగరానిదేదో జరిగింది అని స్పష్టమౌతుంది. కానీ, ఏమి జరిగిందో అర్థం కావటం లేదు. ఎలీషా, ఆమె కుమారుడు అనారోగ్యంగా ఉండి ఉంటాడని లేదా గాయపడి ఉంటాడని లేదా మరణించి ఉంటాడని గ్రహించాడా? ఒకవేళ ఆ స్త్రీ ఇక్కడ లిఖింపబడని మాటలు చెప్పిందా?[12] ప్రభువు జరిగిన దాన్ని గురించి ఎలీషాకు గ్రహింపుకు తీసుకొనిరాలేదా? ఈ ప్రశ్నలన్నింటికి సరిగ్గా జవాబులు చెప్పలేము.

ఈ బాలునికి ఏమైయిందో కానీ, వెంటనే *ఏదో ఒకటి* జరగాలి. వెంటనే ఎలీషా, "నీ నడుము కట్టుకొని త్వరగా వెళ్ళుము" అని గేహజీతో చెప్పాడు (2 రాజులు 4:29ఎ). "నీ నడుము కట్టుకొనుము అనగా, నీ నడుముకున్న దట్టిని బిగువుగా కట్టుకొనుము తద్వారా నీవు పరుగెత్తుటకు ఆటంకమేమి ఉండదు" [NIV చూడు] (1 రాజులు 18:46తో పోల్చు). ఎలీషా ఇంకా ఇలా అన్నాడు, "ఎవరైనను నీకు ఎదురుపడినయెడల వారికి నమస్కరింపవద్దు; ఎవరైనను నీకు నమస్కరించినయెడల వారికి ప్రతి మర్యాద చేయవద్దు" (2 రాజులు 4:29బి; దీనిని లూకా 10:4తో పోల్చు). కొన్నిసార్లు శుభాకాంక్షలు తెలియజేసే కార్యక్రమాలు ఎంతో సమయాన్ని మ్రింగివేస్తాయి. ఈ ప్రవక్త ఆ స్త్రీ ఇంటికి వేగంగా వెళ్ళమని మధ్యలో ఎవరు ఆటంకపరచినా ఆగవద్దని తన సేవకుని పురమాయించాడు.

ఎలీషా, తన కఱ్ఱను గేహజీకి ఇచ్చాడు (29ఎ వచనం). అతనితో ఇలా అన్నాడు, "అక్కడికి పోయి నా దండమును ఆ బాలుని ముఖముమీద పెట్టుమని" (29సి వచనం). ఎలీషా యొక్క చేతికఱ్ఱ ఏలీయా యొక్క దుప్పటి వంటి అధికారపు చిహ్నంగా కనిపిస్తుంది (నిర్గమకాండము 4:1-4; 14:16; 17:5, 6, 8-13 వచనాల్ని పోల్చి చూడు). గేహజీకి, ఎలీషా ఆ సూచనలు ఎందుకు చేసాడు? ఈ విషయంలో కొందరెలా అభిప్రాయపడుచున్నారంటే, ఎలీషా, తన సేవకునికి, ఆ స్త్రీకి ఒక పాఠం నేర్పడానికి అంటే యిలాంటి విధానమేది *పనిచేయదని*

చెప్పడానికి అంటారు. ఇక్కడ మనం గమనించగల్గేది ఆ స్త్రీ చెప్పిందంతా చెప్పుకున్నదని కాని దేవుడు ఆ సమస్య యొక్క ఆంతర్యాన్ని ఎలీషా వద్దనుండి యింకా "చాటు" చేస్తునేయున్నాడు (2 రాజులు 4:27), అంటే ఈ ప్రవక్త తన దగ్గర ఆ కర్ర ఉన్నంత వరకు ఆ బాబుకు *సహాయం చేయగలను.* – వాడికి ఏమి సంభవించినా ఫరవాలేదు అని కర్ర మీద ఆధారపడినాడు.[14] అందుకేనేమో ఆ కర్రను గేహజీ చేతిలో పెట్టి వాడు తనకంటే చిన్నవాడు కదా! తనకంటే వేగముగా పరుగెత్తగలడు కూడ అని భావించాడు.

ఆ మాట వినగానే ఆ స్త్రీకి ఎలీషా ప్రవక్త తన గృహానికి రావడంలేదని అర్థమైపోయింది. వెంటనే ఆమె రెప్పవాల్చకుండా ఎలీషా వైపు చూస్తు, "యెహోవా జీవముతోడు నీ జీవముతోడు, నేను నిన్ను విడువనని" అన్నది (30ఎ వచనం; దీన్ని 2 రాజులు 2:2, 4, 6తో సరి పోల్చు)? ఒక్క మాటలో చెప్పాలంటే, "నీవు రాకుండ నేనిక్కడనుండి పోను!" అని ఎలాగైతేనేమి షూనేమీయురాలింటికి వెళ్ళతాను కదా అంటూ ప్రవక్త అనుకున్నాడు కాని, సరే అతడు పోవచ్చు పోకపోవచ్చు, కాని యిప్పుడైతే "అతడు లేచి ఆమెతో కూడ పోయెను" (30బి వచనం). ఇక ఆమెగారు గాడిద నెక్కింది – తన ప్రక్క సేవకుడు నడుస్తున్నాడు: వాడి వెనుక వారితో సమానంగా నడవడానికి త్వరపడుచున్న ప్రవక్త.

ఈ లోపల గేహజీ ఆ స్త్రీ గృహానికి చేరుకొని పరుగెత్తుకుంటూ మెట్లెక్కి ప్రవక్త గదిలోనికి వెళ్ళి "ఆ దండమును బాలుని ముఖము మీదపెట్టెను" (31ఎ వచనం). తనకు ఆ బాధ్యత అప్పగించినందుకు తను ఎంతో ఉప్పొంగిపోయాడు. కానీ "యే శబ్దమును రాకపోయెను" అతడెంతో నిరుత్సాహానికి గురికావలసి వచ్చింది (31బి వచనం). "జీవానికి ఏ చిహ్నము కనిపించలేదు" (NEB). అతడు తిరుగు ముఖంపట్టాడు. ఆ స్త్రీనీ ఎలీషాను కలుసుకున్నాడు. అయ్యా! "బాలుడు మేలుకొనలేదని" అంటూ తన ముఖాన్ని ఇంతగా చేసికొని నిరుత్సాహముతో చెప్పాడు (31సి వచనం). బహుశ ఆ స్త్రీ యిలా అనుకొని ఉండేది, "నేను వాళ్ళకు ఈ కర్ర వైద్యం పనికిరాదు బాబు అని ముందుగానే చెప్పియుండవలసినది! అందుకే నేను ఎలీషాగార్ని ఆయనే వ్యక్తిగతంగా రావాలని పట్టుపట్టింది!"

## ప్రయత్నము మరియు విజయము (4:32–37)

### ప్రయత్నము

ఆ స్త్రీ మరియు ఆ పురుషులు వారి ప్రయాణాన్ని మరలా సాగించారు. చిట్టచివరకు ఇల్లు చేరుకున్నారు. ఆ పిల్లవాడు మధ్యాహ్న వేళలో మరణించాడు (20వ వచనం). ఆమె కర్మెలు పర్వతానికి వెళ్ళడం వలన ఎంతో ఆలస్యమైనది. ఎలీషా! వాస్తవానికి ప్రయాణానంతరం విశ్రాంతి తీసుకొనవలసి వచ్చింది. కానీ, విశ్రాంతి తీసికొనుటకు సమయం లేదు. ఆ ప్రవక్త తన గదికి వెళ్ళగానే గదిలోనుండి తొంగి చూసాడు, "బాలుడు మరణమైయుండి తన మంచము మీద పెట్టబడియుండుట చూచి" (32వ వచనం). ఇప్పుడు కాని ఎలీషాకు ఆ సమస్య యొక్క లోతు ఎంతగా ఉన్నదో గ్రహింపు కలుగలేదు. ఆ ముద్దుల బాలుడు మరణించి తన పడక మీద పరుండి ఉండడం అమాయకపు నిద్రలో ఉన్నట్టు అతడు గమనించి గుండె పగిలిపోయింది.

ఎలీషా, గదిలోనికి వెళ్ళి గది మూసాడు (33ఎ వచనం; 4ఎ వచనంతో పోల్చి చూడు).

గేహజీని ఆ తల్లిని గదినుండి బయటికి పంపివేసాడు (1 రాజులు 17:19, 23 పోల్చి చూడు). ఎప్పుడైతే ఆ బాబుతో అతడు ఏకాంతముగా ఉన్నాడో అతడు ప్రభువుకు ప్రార్థించాడు (2 రాజులు 4:33బి వచనం). బహుశ అతడు ఆ స్త్రీ తనను ఆ కర్మెలు పర్వతము దగ్గర కలిసినప్పుడే ప్రార్థన ప్రారంభించి ఉంటాడు. ఎప్పుడైతే ఆ పరిస్థితిని చూసాడో, అతని విశ్వాస సహితమైన ప్రార్థన ఆవరించింది.

అతడు “మంచముమీద ఎక్కి బిడ్డమీద తన్ను చాచుకొని తన నోరు వాని నోటిమీదను తన కండ్లు వాని కండ్లమీదను తన చేతులు వాని చేతులమీదను ఉంచి. బిడ్డమీద పొడుగుగా పండుకొనగా ఆ బిడ్డ ఒంటికి వెట్ట పుట్టెను” (34వ వచనం). ఎలీషా ఎందుకు వింతైన ప్రయోగం చేయవలసి వచ్చింది. బహుశ తన గురువు ఏలీయా మరణించిన బాలుని లేపిన విధానం అయివుంటుంది (1 రాజులు 17:21, 22). ఏలీయా గూర్చి ఉన్న పాఠములో ఆ ప్రవక్త సారెపతు విధవరాలి కుమారుని ఎలా లేపినాడో నేను వివరించాను: ఆ విషయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

> గతములో ఎప్పుడు జరుగని గొప్ప విషయం అన్న సంగతి జ్ఞాపకం ఉంచుకోండి. కొన్ని వేలమంది ప్రజలు ఏలీయా దినాల్లో మరణించారు. వారిలో ఒక్కరు కూడ తిరిగి బ్రతుకలేదు. ఈ అసాధ్యమైన కార్యాన్ని ఏలీయా చేయడానికి సాహసించాడు. ఈ విషయంలో అతనికి ఎలాంటి గతమును గూర్చి అనుభవము లేదు. లేదా అనుసరించటానికి అనుకరణ పట్టిక లేదు. ...
>
> ఏలీయాకు చనిపోయిన వారిని ఎలా బ్రతికించాలా అనే మార్గదర్శిక పుస్తకం లేనే లేదు. అతడు చేసిన పనిని గురించి ఈ అంశము పేరు ఇలా ఉండవచ్చు. “నీవు ఏమి చేస్తావో చెయ్యి.” అతడు బహుశ తన శరీరము యొక్క వెట్టను పంచుకోవడం ఎంతో సబబుగా ఉన్నది మరియు అతడు ఎలీషాతో కూడ ఈ విషయాన్ని చెప్పి ఉన్నాడు. కాబట్టి, ఎలీషా ఈ అద్భుత కార్యము చేయగలిగాడు (2 రాజులు 4వ అధ్యాయము). అది ఆ విధంగానే చేయబడాలా? బహుశ, కాదేమో. ...[15]

ప్రస్తుతం మన కథ కొనసాగుతుంటే ఎలీషా *ప్రార్థిస్తున్న సంగతి* మాత్రం దృష్టిలో ఉంచుకోండి (2 రాజులు 4:33). ఎలీషా ఆ బాలుని మీద చాచుకొని పండుకొని ఉండడం ఎలాంటిదంటే ఒక నదిని గొఱ్ఱె చర్మపు వస్త్రముతో కొట్టడం లాంటిది కాదు. దాని రెండు పాయలుగా చీల్చడానికి (2:14) లేదా చెడు నీళ్ళను మంచి నీళ్ళుగా చేయడానికి ఉప్పునీళ్లు జల్లటం కాదు (2:21). ఇలాంటి ఆచరణలలో శక్తి ఏమిలేదు. కానీ, అనుబంధములో శక్తి ఉన్నది: ఎలీషాకు ప్రభువుతో ఉన్నటువంటి సంబంధ బాంధవ్యాలు. దేవుని నుండి శక్తి దిగి వచ్చింది.

**విజయము**

ఎప్పుడైతే ఎలీషా ఆ బాలునిపై చాచుకొని పరుండినాడో, అప్పుడే ఆ బాలుని శరీరములో “వెట్ట కలిగింది” (4:34), కానీ, జీవము వచ్చినట్టుగా చిహ్నాలు ఏమిలేవు. ఆ ప్రవక్త లేచి నిలువబడి ఆ గదిలో ఇటు అటు తిరిగాడు (35ఎ వచనం). బహుశ, ఏమి చేయాలో తోచక తికమకపడ్డాడు. అతని ప్రార్థనలు బహుశ ఎంతో కరుణతో నింపబడి ఉంటాయి. చివరిగా ఏలీయా చేసిన పద్ధతిని అనుసరించడానికి నిశ్చయించాడు. మరలా ఆ బాలుని శరీరం

మీద చాచుకొని పండుకొన్నాడు (35బి వచనం). ఇప్పుడు అతని ఫలితం ఫలించింది. "బిడ్డ యేడుమారులు తుమ్మి కండ్లు తెరచెను" (35సి వచనం).

కొంతమంది రచయితలు ఆ యేడు తుమ్ముల యొక్క ఆంతర్యాన్ని ప్రత్యేక అర్థాన్ని కనుక్కోవడానికి ప్రయత్నిస్తున్నారు.[16] కొన్ని పురాతన వ్యాఖ్యానాలు ఈ ఏడు తుమ్ములు తుమ్మడం వలన అతనిలోని విషపదార్థాలు బయటికి నెట్టబడినాయని వ్యాఖ్యానిస్తారు. కానీ, అతని శరీరములో ఎలాంటి విషపదార్థం ఉన్నట్టు కనిపించవు. అదే వైద్యపరమైన వివరణ ఇవ్వబడాలంటే, ఈ బాలుడు కోత సమయంలో దుమ్ముధూళికి గురై ఉంటాడు. అతని ముక్కులలో ఆ ధూళి రేణువులు నిండిపోయి ఉంటాయని జవాబు లభిస్తుంది.[17] కొందరు ఏడు అనే సంఖ్య యొక్క ప్రత్యేకతను వివరిస్తారు. అది యూదులకు ఒక ప్రత్యేకమైన పరిశుద్ధ సంఖ్య అని చెప్తుతారు. "కొందరంటారు," వాస్తవంగా, "రెండుసార్లు తుమ్మడం ప్రజలకు సహజం." కాబట్టి ఈ వాక్యభాగములోనికి మనం అంత లోతుగా వెళ్ళనవసరంలేదు. ఏడుమార్లు తుమ్మడం అనేది చూస్తున్న వ్యక్తి రాసే వివరణ మాత్రమే. ఎలీషా గేహజీకి చెప్పినాడు, గేహజీ ప్రతివారికి ప్రకటన చేశాడు (8:4, 5 వచనాలు చూడు).

ఈ బాలుడు తుమ్మిన విధానాన్ని గూర్చి ఒక సాధారణమైన వివరణ వుంది: వాడు మరలా ఊపిరి పీలుస్తున్నాడు అని సుమా! తుమ్మడమే కాదు కళ్ళు కూడ తెరచినాడు. ఆ బాలునిలోకి జీవం ప్రవహించింది. చివరకు దేవుని శక్తివల్ల "మరణించినవాడు తిరిగి లేపబడినాడు" (8:5)! ఆ బాలుడు తన స్నేహితుడైన ఎలీషాగారిని చూచి కిలకిలా నవ్వడం, తిరిగి ఎలీషా ఆ బాబును చూచి నవ్వడం ఎంతో చూడముచ్చటగా వుంది.

గేహజీ మాత్రం ఎప్పటికైనా తనకు పిలుపు వస్తుందనుకున్నాడేమో తలుపు దగ్గరే కాసుకొని వున్నాడు. ఎలీషా "ఈ షూనేమీయురాలిని పిలువుము" అని అతనికి చెప్పాడు (4:36ఎ). ఆ తల్లి మెట్ల దగ్గర నిలువబడి ఏం జరుగుతుందో తనేవార్త వినాల్సివస్తుందో అంటూ ఎంతో ఉత్కంఠతో యున్నది. ఎలీషా ఒకవేళ ఏలీయా వలెనే అద్భుతం చేసియున్నాడా లేక ఒకవేళ చేయకపోతే ఎలా అన్న సంగతి కూడ బాగా ఆలోచించింది. ఆమె వాకిలి వద్దకు వచ్చినప్పుడు ఆమె సంతోషాన్ని మీరు చూడాలేగాని అది వివరించనలవికానిది. ఎలీషా ఆ బాబు వంక చూపిస్తూ మంచం మీద కూర్చొని వున్న – సజీవుడైన – ఆమె కుమారుని చూపిస్తూ "నీ కుమారుని ఎత్తుకొనుమని ఆమెతో చెప్పెను" (36బి వచనం).

వెంటనే ఆ తల్లి పరుగెత్తి ఆ బాలుని పడక దగ్గరకి వెళ్ళుతుందని మనం ఊహిస్తాం. కానీ ఆమె వెళ్ళి ప్రవక్త పాదాల మీద పడింది. కృతజ్ఞతలు తెలుపుకున్నది (37ఎ వచనం). ఆ తర్వాతనే ఆమె తన ముద్దుల కుమారుని తన కౌగిలిలోకి తీసుకొంది (37బి వచనం). ఆ తర్వాత ఈమె "బైటకు వెళ్ళింది" (37సి వచనం). ఇక ఆమె ఆనందభాష్పాలు మనం చూడవలసిందే. ఆమె కుమారుడు గతంలో ఎంతో విలువైనవాడు, ఇప్పుడింకా విలువైనవాడు. ఎందుకంటే వాడితో గడిపే ప్రతిక్షణం ప్రభువు తనకు ప్రసాదించినవి. ఇక రోజులు గడుస్తూన్న కొలది ఆ బాబు దినదినము అభివృద్ధి చెందుతుంటే ఆమె ఆనందానికి అంతులేదు.

## అలజడి మరియు ఆదరణ

### అలజడి

ఆ స్త్రీ తన కుమారుని పోగొట్టుకున్నప్పుడు ఆమెకు కలిగిన అలజడి ఆవేదనతో మీరు ఏకీభవించియుంటారు. బహుశ మీ జీవితాల్లో కూడ పరీక్షలు ఎదురైయుండవచ్చు. ఎందుకు అన్న విషయం మీకు మింగుడు పడియుండకపోవచ్చు. బహుశ నీవు ఉద్యోగం పోగొట్టుకొనియుండవచ్చు. నీ కుటుంబాన్ని నీవు పోషించుకోవాల్సివుంది, నీకు కావలసిన మందులు నీ రాబడినంతా హరించివేసియుండవచ్చు – బహుశ నీ భార్య లేక నీ భర్త పిల్లల్ని నీ మీద వదిలి యింటినుండి వెళ్ళిపోయియుండవచ్చు. బహుశ నీకెంతో ప్రియమైన నీ బిడ్డ చనిపోయియుండవచ్చు, ఔను పాపం షూనేమీయురాలి కుమారుడు కూడ చనిపోయాడు గదా "అయ్యో! ఈ విపత్తు నాకెందుకు సంభవించింది, నాకర్థం కావడంలేదే!" అంటూ నీవు రోదిస్తున్నంతవరకు పరిస్థితులు దిగజారినవా?

### ఆదరణ

విషాదం నిన్ను చీల్చివేస్తుందా, అయితే మన పాఠ్య భాగంలోని రెండు వివరణల ద్వారా నీవు ఆదరణను పొందవచ్చు: (1) ఆ తల్లి ఎలీషాకు పరిస్థితులు విన్నవించుకున్నప్పుడు అతడామెను కోపగించుకోలేదు. నీవు నీ సమస్యలతో సతమతమవుచున్నప్పుడు, దేవునికి తెలుసు; ఆయన అర్థంచేసుకోగలడు, ఆయన నిన్ను ప్రేమిస్తునేయున్నాడు. (2) చివరిలో, దేవుడు ఆ తల్లి హృదయవేదనను తుడిచివేశాడు పరిస్థితులన్ని కుదటపడ్డాయి. 2 రాజులు 4:18–37వరకు ఉన్న విభాగంలో ఆయన సమస్యలను సరిచేసినట్టు నీ సమస్యలన్నింటిని తీరుస్తాడని నేను నీకు వాగ్దానం చేయను సుమా! కాని శ్రమలలో కూడ సంతోషించగల శక్తిని, సమస్యలను త్యజించుకుంటూ విజయవంతంగా బైటపడే శక్తి సామర్థ్యాలను ఆయన ప్రసాదించాడు. ఆయన దేవుడైయున్నాడు, ఆయన "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమీయులకు 8:28).

జీవితాంతము విశ్వాసముతో జీవించినవారి సైతము: మనకు కనిపించే ప్రతి విషయం వాస్తవానికి *అలా లేదు* అన్న సూత్రాన్ని నేర్చుకున్నారు. కొన్నిసార్లు మనకు కనిపించే విషయాలన్ని వాస్తవాలు కావు. ఈ మధ్య నేను ఒక కథను విన్నాను. అది యిలా ఉంది.[18] 1900వ శతాబ్దంలో జీవించిన ఒక సంగీత విద్వాంసుడు ఒక ఓడ ప్రయాణ ప్రారంభోత్సవ సభకు ఆహ్వానించబడినాడు. తనకు యివ్వబడిన ఈ ఘనతకు అతడెంతో ఉప్పొంగిపోయాడు. తన సంగీత వాయిద్యాలను ఆ ఓడలోనికి పంపించాడు. తరువాత అతడు ప్రయాణమై వెళ్తుండగా అతన్ని ఎవరో కిడ్నాప్ చేసినారు. అప్పుడు అతని ఆలోచనలు ఎలా తారుమారు అయిపోయినాయో ఎవరైనా ఇట్టే గమిస్తారు: "ఇది నాకెందుకు సంభవించింది? యిది నాకెంతో సదావకాశము, అయితే ఏమి జరిగిందో చూస్తే నాకు ఆశ్చర్యంగా ఉంది? ఇంతకంటే చెడు ఎలా సంభవిస్తుంది? ఇది ఎందుకు సంభవించింది?" తదుపరి అతడు చైనా దేశానికి తప్పించుకొని పోయాడు, చివరకు అతను తెలుసుకున్నదే మిటంటే తను వెళ్ళవలసిన ఆ పెద్ద టైటానిక్ ఓడ మునిగిపోయిందని, దానితోపాటు 1,500

మంది మరణించారని.[19] ఈ సందర్భంలో బహుశ తనను ఎత్తుకొనిపోయిన ఆ దొంగలకు "మీకు చాలా వందనాలని ఉత్తరం వ్రాసి ఉండవచ్చు! చూచారా? ఆ విషాదం జరిగినందువల్ల అతని మనస్సు ఎలా మారిపోయిందో?

ఎంతో మంది క్రైస్తవులను నేను దర్శించినప్పుడు వారి జీవితాలలో జరిగిన అనేక విషాద సంఘటనలు గూర్చి నాతో పంచుకుంటారు - ఒకవేళ, ఆ సంఘటనే జరగకపోతే యింత గొప్ప ఆశీర్వాదాలతో ఉండక పోయేవాళ్ళమే అని అంటారు.[20] ముగింపులో ఒక మాట సంక్షిప్తంగా చెబుతారు, "నాకు సంభవించిన వాటిల్లో యింతకంటే మంచిది ఏదిలేదేమో అని అంటారు!"

ప్రస్తుతం మన కథలో దుఃఖంచే ఆ తల్లి "ఇది మంచిది" (వచనం 26; చూడు 23 వచనం) అని అంటూ ఒకవేళ అది మంచిది కాక*పోయినా*, అలా అనడం జరిగింది (28 వచనం). తదుపరి ఆమె ఒక్కసారి తన అనుభవముల్లోకి తొంగిచూచి "ఒకవేళ నేను అది జరుగ*కూడదని* ఆలోచించినా, అది మేలుకే!" జరిగింది అని అన్నది కదా - ఒకవేళ నీవు నమ్మకమైన దేవుని బిడ్డవైతే ఎంతో నమ్మకంతో అది ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాంటి పరిస్థితులలోనైనా "అది చాల మేలుకే" అని అంటాము.

> శాంతి ఒక నదిలా ప్రవహిస్తుంటే,
> సముద్ర తరంగములావుంటే;
> ఏది నాకు సంభవించినా,
> "యిది మంచికే, నా ఆత్మీయ మేలుకే"[21]
> అని చెప్పడనికి నీవు నాకు నేర్పించావు.

ప్రభువు మీద పూర్తిగా ఆధారపడి నీ విశ్వాసాన్ని కొనసాగించుకో, బహుశ, నీవు ఎలుగెత్తి చెప్పగలిగే మాటలు నీ జీవితములో ఎంతో స్పష్టమై యుండవచ్చు; "అంతా మేలుకే" దేవుడు ఎలీషా ప్రవక్తకు, నీతిమంతులకు యిలా అభయమిమ్మని బోధించాడు: "-మీకు మేలు కలుగునని నీతిమంతులతో చెప్పుము వారు తమ క్రియల ఫలము అనుభవింతురు" (యెషయా 3:10). మీరు దేవునికి నమ్మకస్తులైయుండండి, అప్పుడు "మీకేది జరిగినా ఏ పరిస్థితులలోనైనా, దుఃఖములోనైనా, ఆపదల్లోనైనా, వ్యతిరేక సందర్భాలలోనైనా, మరణాం తమువరకు అంతా మేలుకరంగానే ఉంటుంది. రాబోవు దినాల్లోను, తీర్పులోను, రాబోతున్న నిత్యత్వములోను అంతయు మేలే."[22]

## ముగింపు

నేను ముగింపక ముందు గేహజీ ఆ స్త్రీతో అడిగిన "*మీరు* సుఖముగా ఉన్నారా?" అనే ప్రశ్నను అడగాలనుకొనుచున్నాను. దేవునికిని నీకును మధ్య సంబంధము బాగున్నదా? నీ ఆత్మతో నీవు సభ్యతగా ఉన్నావా? "లోకము నిన్ను చూచి నవ్వుతుందా? నీ స్నేహితులు పొగుడుతున్నారా, నీ హృదయం నిన్ను మోసం చేస్తుందా"[23]; ఒకవేళ నీకు దేవునికి ఉన్న సంబంధం సరిగా లేనట్లయితే, నీ జీవితములో ఏదికూడ సరిగా జరుగదు. నీవు విధేయతతో ఆయన దగ్గరకు వస్తావా? (మార్కు 16:16; హెబ్రీయులకు 5:9) అప్పుడు ఆయన నిన్ను తన కౌగిలిలో బిగిస్తాడు (గలతీయులకు 3:26, 27)? బహుశ నీవు అవిధేయుడైన/

అవిధేయురాలివైన బిడ్డగా ఉండి ఉంటావు? అలా అయినట్లయితే నీవు తిరిగి ఆయన వద్దకు రావలెను (అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9). నీ ఆత్మీయ అవసరములు ఏమై ఉన్నప్పటికి నీవు ఆయన కృప కనికరం మీద ఆధారపడినట్టయితే "అంతామేలు కరంగా ఉన్నది" అని చెప్పగలవు!

---

సూచనలు

[1]Donald J. Wiseman, *1 and 2 Kings: An Introduction and Commentary,* Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1993), 204. [2]Charles B. Clayton, ed., "headache," *The American Medical Association Home Medical Encyclopedia* (New York: Random House, 1989), 1:507. An aneurysm is a localized swelling of a blood vessel; in this case, it would have been a blood vessel in the brain. [3]Adapted from J. T. Headley, *Sacred Heroes and Martyrs,* rev. and ed. J. W. Kirton (London: Ward, Lock, & Tyler, n.d.), 194. [4]G. Rawlinson, "2 Kings," *The Pulpit Commentary*, vol. 5, *1 & 2 Kings*, ed. H. D. M. Spence and Joseph S. Exell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 66. [5]Wiseman, 204. [6]C. F. Keil and F. Delitzsch, "1 and 2 Kings," *Commentary on the Old Testament,* vol. 3, *1 and 2 Kings, 1 and 2 Chronicles, Ezra, Nehemiah, Esther* (Peabody, Mass.: Hendriksen Publishers, 1989), 311. [7]C. H. Irwin, *Irwin's Bible Commentary* (Philadelphia: John C. Winston Co., 1928), 116. [8]Keil and Delitzsch, 311. [9]వారి కుమారుడు మరణించాడన్న సంగతి ఆ స్త్రీ తన భర్తతో ఎందుకు చెప్పలేదు? ఒకవేళ అతను వెంటనే అంత్య క్రియలు, సమాధికోసం ఏర్పాటు చేస్తాడేమోనని భయపడి యుండవచ్చు. ఆమె కుమారుని యొక్క మరణ చరిత్ర చెప్పేటప్పుడు, బ్రతికున్న తన కుమారుని అతనికి చూపించగలననే నమ్మకంతో ఆమెవున్నది. [10]Keil and Delitzsch, 311-12.

[11]J. Robert Vannoy, notes on 2 Kings, *The NIV Study Bible,* ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 530. [12]ఆమె గృహంలోకి వెళ్ళి ఆ బాలుని ముఖంమీద పెట్టడానికి ఎలా వెళ్ళాలో గేహజీకి బాగా తెలుసు (31 వచనం). అందుచేత ఆ స్త్రీ మరిన్ని వివరాలు అతనికి చెప్పిందని గ్రహించగలము. [13]Keil and Delitzsch, 312-13. [14]ఒక సందర్భంలో పౌలు దుస్తులు తగిలి రోగులు బాగుపడినారు (అపొస్తలుల కార్యములు 19:11, 12). [15]David Roper, "When the Roof Caves In," in "Elijah, 1," *Truth for Today* (August 1993): 24. [16]గ్రీకు భాషలోని బైబిల్లో పాత నిబంధన గ్రీకు భాష అనువాదము ఈ తుమ్మడం గురించి ఎక్కడ కనబడదు. కాని "*ఎలీషా ఏడుసార్లు ఆ బాలుని శవంపై వాచుకొని పరుండినాడని*" తెలుస్తుంది (Clyde M. Miller, *First and Second Kings,* The Living Word Commentary series, vol. 7 [Abilene, Tex.: A.C.U. Press, 1991], 328). [17]నేను బోధిస్తున్న బైబిల్ క్లాస్‌లో ఒక నర్సు యిలా అన్నది, చిన్న పిల్లలు ఆస్తమా వ్యాధితో మరణించగలరు, కొన్నిసార్లు ఈ ప్రాంతాల్లో కోతల సమయంలో ఆ దుమ్ము ధూళికి తట్టుకోలేక మరణిస్తుంటారు అని. [18]ఈ కథను 22 జూలై 2003 నాడు అంగి (రోపర్) లవ్‌జాయ్ గారు నాకు ఓక్లహోమాలోని ఎడ్మండ్ పట్టణంలో నాకు చెప్పినాడు. టైటానిక్ ఎక్స్‌బిషన్‌లో అంగిగారు నాకు చదివి వినిపించారు. [19]టైటానిక్ అనే గొప్ప పాసింజర్ ఓడను ఆ రోజుల్లో నిర్మించారు. అది మంచు శిలలకు ఢీకొని సముద్రంలో మునిగి పోయింది (14–15 ఏప్రిల్ 1912). [20]మీరుకూడ మీ అనుభవంనుండి ఒకటి రెండు విషయాలు చెప్పవచ్చు లేదా యితరుల అనుభవాలనుండి కూడ ఎంపిక చేసుకోవచ్చు.

[21]Horatio G. Spafford, "It Is Well with My Soul," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [22]Henry Blunt, *Lectures on the History of Elisha* (Philadelphia: Herman Hooker, 1839), 81. [23]Ibid., 79.